# మందభాగ్యుడి మందహాసం



— వసుంధర

**బియ్యే పాసైనప్పట్నించీ ఉద్యోగాల కోసం అప్లై చేస్తూ ఉన్న ఊళ్ళోనే యూనివర్సిటీ ఉంది కదా అని ఎమ్మేలో చేరాను. ఎమ్మే డిగ్రీ కూడా వచ్చింది కానీ ఉద్యోగం రాలేదు. ఇప్పుడైతే ప్రొఫెసరు గారు నన్ను, "పి.హెచ్.డి. చేయి. ఉద్యోగం వచ్చేలోగా అయిపోతుంది" అంటూ హామీ యిస్తున్నారు. ఆ హామీలో నాకు తొందరగా పి.హెచ్.డి. అయిపోతుందన్న భావానికి మించి ఇప్పట్లో ఉద్యోగం రాదన్న వాస్తవం స్ఫురించింది.**

ఉద్యోగ ప్రయత్నాలు తీవ్రంగా చేయాలని ఉన్న ఉళ్ళోనే యూనివర్సిటీ ఉన్నప్పటికీ నేను పి.హెచ్.డి.లో చేరలేదు.

మా వీథిలో కల్పన అనే అమ్మాయుంది. మా యిద్దరిదీ చిన్నప్పటి పరిచయం. ఆమె చిన్నప్పుడు బాగుండేది. ఇప్పుడు చాలా బాగుంది. ఆమె అంటే నాకెంతో యిష్టం. తనకూ నేనంటే యిష్టమంటుంది.

కల్పన టెన్తుక్లాసు ప్యాసవగానే చదువు మాన్పించి యింట్లో కూర్చోపెట్టి పెళ్ళి సంబంధాలు చూడ్డం మొదలెట్టారు తల్లిదండ్రులు. ఆమె ప్రయివేటుగా చదివి ఇప్పుడు బియ్యే ఆఖరు సంవత్సరంలోకి వచ్చింది. నేను ఏమ్మేలో చేరినప్పుడు నాకామె పట్ల ఉన్న యిష్టం ప్రేమగా మారగా, "మనం పెళ్ళి చేసుకుందాం" అన్నాను నేనామెతో ఒక రోజున.

"పెద్దవాళ్ళకు చెప్పు" అందామె తనకభ్యంతరం లేనట్లు.

"నువ్వు మీ వాళ్ళకు చెప్పకూడదూ?" అన్నాను. ఎంతైనా నేనుమగ పెళ్ళి వారి తరపు కదా!

కల్పన అర్థం చేసుకుని నెమ్మదిగా, "నీ గురించి మా యింట్లో అనుకుంటుంటారు, నీ కుద్యోగం లేదుగా, మా వాళ్ళకు నచ్చలేదు" అంది.

ఆమాత్రం నేనూ ఊహించగలను. అందుకే, "మీ వాళ్ళ సంగతి నాకెందుకు? నీ సంగతి చెప్పు" అన్నాను. ఆమె నవ్వి ఊరుకుంది.

ఏ ఆడపిల్లయినా ఉద్యోగమున్న భర్తనే కోరుకుంటుందన్న సమాధానం ఆ నవ్వులో నాకు వినిపించింది.

నాకుద్యోగం దొరికే దాకా కల్పనకు పెళ్ళి కుదరకూడదని దేవుణ్ణి ప్రార్థించాను. సులభంగా పేరు తెచ్చుకునే మార్గముంటే దేవుడు కూడా వదులుకోడు కాబట్టి కల్పనకింకా సంబంధం స్థిరపడలేదు.

ఎమ్మే పాసైన ఏణ్ణార్థానికి నా అదృష్టం తిరిగింది.

చిన్నప్పుడు నాన్న వల్ల సాయం పొందిన ఓ ప్రసన్న రాజిప్పుడు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఓ కంపెనీలో పెద్ద ఉద్యోగి. ఆయన తలచుకుంటే ఆ కంపెనీలోనే ఎవరికైనా ఉద్యోగాలిప్పించగలడని తెలిసింది. ఎందుకంటే ఆ కంపెనీ ప్రభుత్వానిదే అయినా ఆటానమస్ సంస్థ!

ప్రసన్నరాజు తన గురించి నాన్నకు వ్రాయగానే నాన్న ఆయనకు నా గురించి వ్రాశాడు. బదులుగా ప్రసన్న రాజే మా యింటికొచ్చాడు.

"మీ వాడు ఎమ్మే ప్యాసయ్యాడు. నిజానికి మా కంపెనీలో ఆఫీసరు పోస్టివ్వాలి. కానీ ప్రస్తుతం కాళీ లేవు? ఇప్పట్లో రావు? కూడా! ప్రస్తుతానికి డీలింగ్ అసిస్టెంటు పోస్టు కాళీగా ఉంది. కంపెనీ కొనుగోలంతా డీలింగ్ అసిస్టెంటు ద్వారానే జరుగుతుంది. కంపెనీకి వచ్చే అతిథులకు వసతి సౌకర్యాలు, లోకల్ ట్రిప్పు, రానూ పోనూ ప్రయాణం టికెట్టు అతడే చూడాలి. కంపెనీ నుంచి బయటకు టూర్లు వెళ్ళే వాళ్ళందరికీ ప్రయాణం ఏర్పాట్లతడే చూడాలి. ఒక్క మాటలో చెప్పాలంటే డీలింగ్ అసిస్టెంటు ఆఫీసులో కంటె రోడ్ల మీదే ఎక్కువగా ఉంటాడు. ఇది మీ వాడి అర్హతకు తగ్గ ఉద్యోగం కాదు. మీ వాడి మెంటాలిటీకి నూటవుతుందంటే నేనీ పోస్టు ఇప్పించగలను." అన్నాడు ప్రసన్నరాజు.

ప్రసన్న రాజెంత అమాయకుడు? ఈ పవిత్ర భారతదేశంలో ఉద్యోగం దొరకాలే కానీ దానికి ఛాయిస్ కూడానా?

"తర్వాత ప్రమోషన్ అవకాశాలుంటాయా?" అన్నాడు నాన్న.

ప్రసన్న రాజు నవ్వి, "ఈ డీలింగు అసిస్టెంటు పనులు చూడ్డానికి మా కంపెనీలో ఓ డిపార్టుమెంటుంది. దాంట్లో ఓ సీనియరాఫీసరు, ఇద్దరు జూనియర్ ఆఫీసర్లు, ఓ అసిస్టెంటు ఉన్నారు. వాళ్ళు తమ ఆఫీసు గది దాటి వెళ్ళడాని కిష్టపడక పోవడం వల్ల ఈ పోస్టును సృష్టించడం జరిగింది తప్ప నిజానికి మా కంపెనీలో వేరే కాళీ లేమీ లేవు. ఈ పోస్టులో ప్రమోషన్ అవకాశాలుండవు. తెలివి తేటలుంటే ఏర్పడిన పరిచయాలనుపయోగించుకుని పలుకుబడి పెంచుకోవచ్చు. చేతిలో డబ్బాడుతుంది. జీతానికి రెండు మూడు రెట్లు మిగుల్చుకోవచ్చు. ఈ ఉద్యోగంలో డబ్బు సంపాదించగల అవకాశాలే కానీ ప్రమోషన్లుండవు" అన్నాడు.

నాకు అర్థమయింది. ఇది చప్రాసీ లాంటి పోస్టు. మామూలు చప్రాసీ కూడా కాదు. కాళ్ళలో సత్తువ వుండే చప్రాసీ కావాలి. నాన్న వల్ల సాయం పొందిన కారణంగా నాకుద్యోగమిప్పించడానికే ప్రసన్నరాజు ప్రత్యేకించి నా కోసం ఈ పోస్టు సృష్టించి ఉంటాడంటే నేనాశ్చర్యపోను.

నాన్న ఏమైనా అనేలోగానేనా అంగీకారం చెప్పేశాను.

"అయితే మంచి రోజు చూసుకుని వచ్చి చేరు. ఈ అపాయింట్‌మెంటు పూర్తిగా నా చేతుల్లో ఉంది. ఇంటర్వ్యూ కూడా అక్కర్లేదు" అన్నాడు ప్రసన్నరాజు.

నాన్న ప్రసన్న రాజుండగానే క్యాలండరు చూసి ముహూర్తం నిర్ణయించాడు. ఆదే రోజుకి సరిగ్గా వారం రోజులుంది.

ప్రసన్న రాజు వెళ్ళిపోయాడు.

నేనుత్సాహంగా నా ఉద్యోగం సంగతి కల్పనకు చెప్పాను.

ఆమె నిరుత్సాహంగా, ఈ ఉద్యోగం బాగాలేదు. ఇంతకంటే మంచిది దొరకదా? అంది.

"నీ కోసమే నేనీ ఉద్యోగానికొప్పుకున్నాను" అన్నాను.

"ప్రస్తుతం నాకో సంబంధం వచ్చింది. వరుడికి నేను నచ్చాను. అతడిది రాష్ట్ర ప్రభుత్వంలో గుమస్తా ఉద్యోగం. నీ ఉద్యోగం కంటె చాలామంచిది, గౌరవమైనది. ఎటొచ్చీ కట్నం కాస్తఎక్కువని మావాళ్ళాలోచిస్తున్నారు"

"నేనైతే కట్నం తీసుకోనని నీకు తెలుసు......"

"కట్నం సమస్య నాది కాదు. నా పెద్ద వాళ్ళది."

"ఇంతకీ నీ అభిప్రాయమేమిటి?" అన్నాను.

"ఏ విషయంలో?"

"ఉద్యోగంలో చేరగానే ఓ సెలవురోజున వచ్చి నాతో తీసుకుని వెళ్ళిపోతాను. వస్తావా?" అనడిగాను.

కల్పన నవ్వింది.

"ఆడపిల్ల క్కావలసింది భర్త అందానికి కూడా మించి అతడి హోదా! ఎందుకంటే అతడి హోదా ఆమె హోదాను పెంచుతుంది" అన్న సమాధానం నా కామె నవ్వులో వినబడింది.

నాలో నిరుత్సాహం బయల్దేరింది. నాకు 'ద్యోగం దొరికినా కల్పన దొరకడం లేదు. కల్పన లేనిదే నాకు జీవితం శూన్యమనిపిస్తోంది.

కల్పనను నేను నిజంగా ప్రేమిస్తున్నానో లేదో తెలియదు. అసలు ప్రేమంటే ఏమిటో సరిగ్గా తెలియదు నాకు. కానీ కల్పన నాకు దక్కదంటే మనసు శూన్యమైపోయింది. ఆ విషయానికి నేనెంతగా అప్సెట్టయ్యానంటే ఆ సాయంత్రమే నాకు యాక్సిడెంటయింది. నేను కారు కింద పడ్డాను. తప్పు పూర్తిగా నాది.

కల్పన గురించిన ఆలోచనలు నన్ను రోడ్డు మీంచి హాస్పిటల్ బెడ్ మీదకు చేర్చాయి. నా ఎడమ కాలుకి బాగా దెబ్బ తగిలింది. నేను బహుశా శాశ్వతంగా కుంటివాణ్ణైపోతాను.

ఈ విషయం తెలియగానే నా గుండె ఆగిపోతుందనిపించింది. కాలు లేకపోతే ప్రసన్నరాజివ్వాలనుకున్న ఉద్యోగానికి నేను పనికిరాను. కల్పన నన్ను శాశ్వతంగా మరిచిపోతుంది.

నేనెంత మంద భాగ్యుణ్ణి?

ఏ రోజున నేనుద్యోగంలో చేరాలనుకున్నానో ఆ రోజునే నా కాలికి ఆపరేషన్ చేయడానికి డాక్టర్లు ముహూర్తం నిర్ణయించారు.

ఆపరేషన్ జయప్రదంగా జరిగింది. డాక్టర్లు నా కాలు తీసి వేయలేదు కానీ ఆ కాలిపై నేను బరువుంచి నడవలేను. నేను శాశ్వతంగా కుంటివాడినై పోయాను.

ఆపరేషన్ అయ్యాక హాస్పిటల్లో నేను పది రోజులున్నాను. డిశ్చార్జి చేయడానికో రోజు ముందు నన్ను చూడ్డానికి కల్పన వచ్చింది.

ఆమెను చూసి నేను ముఖం తిప్పుకున్నాను.

కల్పన అంటే నాక్కోపం లేదు. ఒకప్పుడు అందం, ఆరోగ్యం, చదువు ఉన్న యువకుడిగా గర్వంగా ఆమె వంక చూసే వాణ్ణి. ఇప్పుడో కుంటివాడిగా ఆమెను చూడాలంటేనే సిగ్గుపడుతున్నాను.

కల్పన నన్ను ప్రేమగా పలకరించింది. అభిమానంగా ఓదార్చింది. నా సుగుణాలను పొగిడింది. నేనంటే ఇప్పటికీ తన కిష్టమేనంది. ఇలాంటి పరిస్థితుల్లో తను నాకు తోడుగా వుండాలంది, ఉంటానంది.

నేనాశ్చర్య పోయాను.

కల్పన నన్ను పెళ్ళి చేసుకుంటుందిట!

"నా మీద జాలిపడుతున్నావు కదూ," అన్నాను బాధగా.

"ప్రేమకు జాలి అని పేరు పెట్టకు" అంది కల్పన.

కల్పన వంటి అందమైన అమ్మాయికి నావంటి కుంటి భర్త! ఈ త్యాగాన్నామె చేయవచ్చు. కానీ నేను భరించగలనా?

"మరి మీ వాళ్ళు పెళ్ళి కొప్పుకుంటారా?"

"ఎందుకొప్పుకోరు? నువ్విప్పుడాఫీసరువి కదా!" అంది కల్పన.

"అదేమిటి?" అన్నాను తెల్లబోయి.

"అవును. మీ నాన్నగారి స్నేహితుడు ప్రసన్న రాజుగారు నీ విషయం తెలుసుకుని నిన్ననే ఫోన్ చేశారట. ఆయన కంపెనీలో వికలాంగుల కోటాలో ఓ ఆఫీసరు పోస్టు ఖాళీ ఉందిట. సరైన అర్హతలున్న వ్యక్తి దొరక్క ఆ కోటా రెండేళ్ళుగా భర్తీ కావడం లేదుట. ఆ పోస్టు నీదేనని ఆయన ఫోన్ చేసి మీ నాన్నగారికి హామీ ఇచ్చారు" అంది కల్పన.

దురదృష్టం నా కాలు పోగొట్టింది. ఆ దురదృష్టమే నాకు అందుబాటులో లేని ఉద్యోగాన్నీ, అందదనుకున్న కల్పననూ ఇస్తోంది. అయినా నాకు సంతోషంగా లేదు.

"కల్పనా! నీవు నన్ను కాదు, నా హోదాను పెళ్ళి చేసుకుంటున్నావు కదూ!" అన్నాను.

సాధారణంగా ఇలాంటి ప్రశ్నలకు నవ్వులో సమాధాన మిచ్చే కల్పన ఈ రోజు మాత్రం, "ఇలాంటి సమయాల్లోనే కదా నిజమైన ప్రేమ బయట పడేది! నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాననడానికి మన పెళ్ళే నిదర్శన మవుతుంది" అంది.


ఆమె సమాధానం నాకు నచ్చ లేదు, ఎప్పటిలా నవ్వితేనే బాగుంటుందనిపించింది.

"నా ప్రేమ నీకు సంతోషం కలిగించడం లేదా?" అంది కల్పన నాలో ఏ భావమూ ద్యోతకం కాకపోవడంతో.

బదులుగా నేను నవ్వాను.

మందభాగ్యుణ్ణే కావచ్చు నేను. కానీ ఆ మందభాగ్యమే మందహాసం చేసే అవకాశమిచ్చింది నాకు.

◇

వచ్చే సంచికతో
ప్రారంభమవుతున్న
రుద్రనేత్ర
తొలి సంచికనుంచీ
చదవండి!

ఒక కలరు టి.వి.,
ఒక బ్లాక్ & వైట్ టి.వి.,
ఒక పోర్టబుల్ టి.వి.
ఉచితంగా పొందండి!!
ఇది
యండమూరి వీరేంద్రనాథ్
సీరియల్!
ప్రక్కవారి దగ్గర తీసుకుని చదివే
ప్రయత్నం చేస్తే
మీరు చాలా నష్టపోతారు